# "దేవతా వస్త్రాలు"

సెక్సు సినీ ప్రొడ్యూసర్ ప్రేమ్‌నాథ్ తన భార్య పవిత్రతో అర్ధశత దినోత్సవం జరుపుకుంటున్న తన మూడవ చిత్రం "సెక్సు సుందరి" సందర్భంగా వేదికపై ఆసీనులయ్యారు. హాలంతా అభిమాన సంఘాలతో నిండిపోయింది. ప్రేమ్‌నాథ్ విజయగర్వంతో సభ ప్రారంభించాడు. తన మూడు చిత్రాలను వరుసగా ఆదరించి కనక వర్షం కురిపించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞత తెలియచేసుకున్నాడు. ముసి ముసి నవ్వులతో పవిత్ర జారిపోతున్న పమిటను అదిమి పట్టుకుంటోంది.

అభిమాన సంఘాల యువకులు ఒక్కొక్కరూ వేదిక నెక్కి తమ తమ చిరు కానుకలను పవిత్ర ద్వారా ప్రేమ్‌నాథ్‌కు అందచేస్తున్నారు. ప్రేమ్‌నాథ్ కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ "చిత్ర నిర్మాతలే నన్ని నటీమణులను తీసుకు రాలేదేమని మీ అందరికున్న సందేహాన్ని నివృత్తి చేస్తున్నారు. నిజంగా వారిక్కడికి వస్తే మీరు రెచ్చిపోయి సుఖాంతం కావలసిన సభను




విషాదంగా మారుస్తారు" అని ముగించేస్తూండగా ఒక వృద్ధుడు వేదిక నెక్కి దేవతా వస్త్రాన్ని పవిత్రకు అందచేశారు. "చూశారా! నా సెక్సు చిత్రాలు యువతీ యువకులనే కాక వృద్ధులను కూడా ఆకర్షిస్తున్నాయన్న మాట! ఈ దేవతా వస్త్రాన్ని నా నాల్గవ చిత్రంలో తప్పక వాడుకుంటాను" అనగానే వృద్ధుడు "చిత్రంలో ఓ సోదరీమణికి కట్టబెట్టి అవమానించడానికి కాదు బాబు నేను నీకిచ్చింది. మీ భార్యకు ఈ వేదికపై కట్టే నన్ను నా నాతోపాటు మీ అభిమాన సంఘాల యువకుల్ని ఆనందించేలా చేయండి" అన్నాడు.

ప్రేమ్‌నాథ్ మారు మాటాడలేక పోతున్నాడు. పవిత్ర చూపుల్లో భయం "మనింటి గౌరవ మెంతో ఎదుటి వారి గౌరవం కూడా అంతేనన్న జ్ఞానం లోపించి తీస్తున్న చిత్రాలు. యువతీ యువకుల్లో కామోద్రేకం రెచ్చగొట్టడం కాదు మనక్కావలసింది. శరత్‌బాబు సాహిత్యం లాంటి అతి సహజమైన కథలు- అంటూ కన్నీరు తుడుచుకుంటూ వేదిక దిగాడా వృద్ధుడు.

కాయితి అప్పారావు

# "..........బియ్యపుగింజ"

పక్క ఇంట్లోంచి సన్నగా ఏడుపు వినబడుతోంది. ఆ నాటాలో రెణ్ణెల్ల క్రిందట దిగిన జంటలో భార్య గొంతే అది. ఆమె మాట కూడా వినబడుతోంది.

"ఏమండీ! ప్లీజ్! నన్నొదిలేయండీ! ప్లీజ్!..." ఆమె గొంతు దీనంగాను, హృదయవిదారకంగాను వినిపిస్తోంది. సాయంత్రం ఏడు గంటలు కూడా కాలేదు. ఏం చేస్తున్నాడు అతడు తన భార్యను? మెత్తగా, భార్యా విధేయుడుగా కనబడుతూనే ఆమెను హింసిస్తుంటాడా? దేనికి? కట్నం కోసమా?... నా ఆలోచన పరిపరి విధాలపోయింది.

నిజానికి ఆ జంట ప్రక్కనాటాలో దిగినప్పటి నుంచి "మేడ్‌ఫర్ ఈచ్ అదర్" పోటీలో ఫస్ట్ ప్రైజ్ కొట్టేసిన స్థాయిలో ఒకరినొకరు వదలలేనట్టుగా ప్రవర్తిస్తున్నారు. పెళ్ళయి ఏడాది కూడా కాలేదట. అప్పుడే పిల్లాపీచూ ఊసు రాదు. ఎక్కడకు వెళ్ళినా జంటగానే గాని, ఒంటిగా వెళ్లిన సందర్భం నేను గమనించలేదు. సినిమాలకి, బీచి షికార్లకి... ఒక చోటికనేమిటి ఈ లోకమంతా వారిదే అన్నట్టు గత రెణ్ణెల్లుగా తెగ తిరిగేస్తున్నారు. పేర్లుకూడా ఏమిటో కావాలని పెట్టుకున్నట్టు రాధ... కృష్ణ... చెప్పొద్దూ నాక్కొంచెం చికాకో, అసూయో తెలియని భావం కూడా ఏర్పడింది... తగ్గట్టు మాయావిడ సణుగుడు.

"హు... మీరు ఉన్నారు ఎందుకు... పట్టుమని పది రోజులైనా సరదాగా ఎక్కడికైనా తీసికెళ్ళారా? హు! వాళ్ళ చూడండి... చిలకా గోరింకల్లాగా..."

నా ఆలోచనల ప్రవంతి తెగిపోయింది — ప్రక్క నాటాలో గొంతు మరింత గట్టిగా వినబడేసరికి.

"మీకు దణ్ణం పెడతాను... నన్నొదిలేయండి! ప్లీజ్!... మీ కాళ్ళు పట్టుకుంటాను... ప్లీజ్..." ఏడుపు స్థాయి కూడా పెరిగింది.

పక్కనాటాలో ఏదో దారుణమే జరగబోతున్నట్టు నా సిక్స్త్ సెన్స్ చెప్పింది. మరో వరకట్న మరణానికి నేను సాక్షిని కాబోతున్నానా? "నో! వీల్లేదు" ఒక ఉదుటున లేచి పక్కనాటాలోకి వెళ్లాను.

"రండి మాస్టారు! రండి!..." ఆహ్వానించాడతడు ఏడుపు గొంతుతో.




మంచంమీద ఆమె పడుకుని వుంది. ప్రక్కన స్టూలుమీద మందు సీసాలు ఏవో పెట్టి వున్నాయి. అతని చేతిలో చిన్న గ్లాసులో ఏదో ద్రవ పదార్థం.

"ఏమైనా వచ్చినా మందులు త్రాగడానికి నానా ఇబ్బంది పెడుతుందండి. ఉదయం నుండి జ్వరం... మందు తాగకపోతే ఎలా!... మీరైనా చెప్పండురూ" అతని కళ్లల్లో నీరే తక్కువ.

నా నోట మాట రాలేదు. —వైశాఖి

# రహస్యం

అనుమతి లేకుండా తన రాజ్యంలోకి ప్రవేశించిన ఒక కొత్త వ్యక్తికి రాజు మరణ శిక్ష విధించాడు. తెల్లవారుతుండగా సైన్యాధిపతి రాజు వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చాడు. ఆయన మొహం కళా విహీనంగా వుంది.

"ప్రభూ ఆ కొత్తవాణ్ణి చంపడం అసాధ్యంగా వుంది. అమలులో వున్న అన్ని శిక్షల్ని విధించాం. అయినా చావలేదు ధడవ! బోనులో నిలబెట్టి బాణాలతో కొట్టాం. అన్నింటిని అతి చాకచక్యంగా తప్పించుకున్నాడు. మన విలుకాండ్రు అలసి పోయారే తప్ప వాడినేమీ చేయలేక పోయారు. గుర్రాలతో తొక్కించి చంపాలని చూశాం. వేగంగా మీద మీదకు వస్తున్న బలిష్టమైన గుర్రాల బారి నుంచిచి అత్యంత లాఘవంగా నవ్వుతూ తప్పించుకున్నాడు. వాడి నైపుణ్యం అమోఘం. ప్రమాదాన్ని వెంట్రుక వాసిలో తప్పించుకున్నాడు. ఇక చివరి ప్రయత్నంగా వాడిని దుర్గంధ లోయలో పడవేశాం. ఆ ప్రయత్నంలో అక్కడి దుర్గంధాన్ని భరించలేక మన సైనికుడు మరణించాడు. కాని కొత్తవాడు మాత్రం అంత దుర్గంధంలోను పాడుకుంటూ కులాసాగా తిరిగాడు..." అంటూ వివరించాడు. రాజు మెచ్చి కొత్త వాణ్ణి సత్కరించి ఆ విద్యల రహస్యాలు అడిగాడు.




అందుకు ఆ కొత్తవాడు "రాజా జీ, మాది హైద్రాబాద్. రోజూ ఆటోలను, సిటీ బస్సులను తప్పుకు తిరిగే మాకు గీ గుర్రాలు, బాణాలు ఏం లెక్క. కోరంటిలో, మూసీలో క్రికెట్ ఆడుకునే మమ్మల్ని గీ దుర్గంధం లోయ ఏం చేస్తాది..." అని వెళ్ళబోతూ రాణికేసి చూసి కన్నుగీటి విజిలేసి వెళ్ళిపోయాడు.

రవీంద్రజ్యోతి